క్లుప్తంగా

పరిశుభ్రత పాటించాలి



తాడ్వాయి(ఎల్లారెడ్డి): ప్రతి ఒక్కరు పరిశుభ్రతను పాటించాలని జల్ జీవన్, ఉమెన్స్ ఎంపర్మెంట్ సొసైటీ సంస్థ డైరెక్టర్ వెంకట లక్ష్మి అన్నారు. తాడ్వాయిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం న్యూట్రిషన్ ఫుడ్, సేఫ్టీ హెల్త్ ఫుడ్‌పై అవగాహన కల్పించారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి



తాడ్వాయి(ఎల్లారెడ్డి): విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని మండల ఎంపీడీవో సయ్యద్ సాజీద్ అలీ అన్నారు. ఆయన శుక్రవారం తాడ్వాయి బాలికల గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. పప్పులతో పాటు తాజాగా ఉండే కూరగాయలు, ఆకుకూరలను వాడాలని సూచించారు. వంటగదిని శుభ్రంగా ఉంచాలన్నారు.

ఇష్టపడి చదివితే మంచి భవిష్యత్తు



సదాశివనగర్(ఎల్లారెడ్డి): ఇష్టపడి చదివితే మంచి భవిష్యత్తు ఉంటుందని మాజీ ఉప సర్పంచ్ కలాలి సుక్క సాయాగౌడ్ అన్నారు. శుక్రవారం కుప్రియాల్‌లో గ్రూప్–4 ఉద్యోగం సాధించిన వినయ్‌కుమార్‌ను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినయ్‌కుమార్‌ను ప్రతి ఒక్క యువకుడు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. మాజీ ఎంపీపీ అన్నాల రాజయ్య, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు చాకలి లింగం, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

బాన్సువాడ రూరల్: బోర్లం రోడ్డులో గల తెలంగాణ మైనార్టీ బాలికల రెసిడెన్షియల్ స్కూల్‌ను శుక్రవారం తెలంగాణ విద్యా కమిషన్ సభ్యులు జ్యోత్స్న శివారెడ్డి సందర్శించారు. విద్యార్థుల భోజనం కోసం వినియోగిస్తున్న ఆహార సరుకుల నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న భోజన, వసతి, తదితర సౌకర్యాల గురించి ఆరాతీశారు. కామారెడ్డి డీఈవో రాజు, మైనార్టీ పాఠశాలల ఆర్ఎస్‌సీ కిరణ్‌గౌడ్, పాఠశాల ప్రిన్సిపల్ ధనలక్ష్మి, వార్డెన్ రేష్మాబేగం పాల్గొన్నారు.

‘బీడీ కార్మికులకు ఉపాధి కరువైంది’



కామారెడ్డి రూరల్: రాష్ట్రంలో పనిచేస్తున్న 10 లక్షల మంది బీడీ కార్మికులకు ఉపాధి కరువైందని తెలంగాణ బీడీ కామ్‌గార్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పు లక్ష్మణ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివంది సత్యంలు అన్నారు. శుక్రవారం రామారెడ్డి రోడ్డు నుంచి బీడీ కార్మికుల ఆధ్వర్యంలో కలెక్టరేట్‌కు బీడీ కార్మికులు ర్యాలీగా తరలివచ్చి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న ప్రతి బీడీ కార్మికురాలికి నెలకు 26 రోజుల పని కల్పించాలన్నారు. నెలకు 8 నుంచి 12 రోజులు మాత్రమే పని కల్పిస్తూ చేతులు దులుపుకుంటున్నారన్నారు. గతంలో ఇచ్చిన హామీ ప్రకారం బీడీ కార్మికులకు నెలకు రూ.4.016 పెన్షన్లు తక్షణమే అమలు చేయాలన్నారు. రాష్ట్ర సలహాదారు అనుముల గంగాధర్, ఐరేని రాజేందర్, పర్వవ్వ, తదితరులు పాల్గొన్నారు.

దివ్యహస్తం ఉత్పత్తుల పరిశీలన



కామారెడ్డి అర్బన్: గో ఆధారిత ఉత్పత్తులు చేస్తున్న కామారెడ్డికి చెందిన దివ్యహస్తం ట్రస్ట్‌ను శుక్రవారం సూర్యాపేటకు చెందిన గ్రీన్‌లైఫ్ ఫౌండేషన్ ప్రతినిధులు సందర్శించారు. దివ్యహస్తం ట్రస్ట్ వ్యవస్థాపకులు పోశవ్వకు రాష్ట్ర ప్రభుత్వం బెస్ట్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ పురస్కారం అందజేయడంతో ఉత్పత్తుల తయారీ విధానం, విశిష్టత తెలుసుకోవడానికి గ్రీన్‌లైఫ్ ఫౌండేషన్ ప్రతినిధులు సందర్శించారు. పర్యావరణ పరిరక్షణ కోసం తాము ఇలాంటి ఉత్పత్తులు తయారు చేస్తామని వారు పేర్కొన్నారు.

లింక్ రోడ్లు బీటీకి నోచుకునేనా..?

- హామీలే తప్ప పనులు జరగడం లేదంటున్న గ్రామస్తులు
- ఉత్తునూర్ నుంచి భూంపల్లికి వెళ్లే దారిలో వంతెన లేక ప్రమాదకరంగా మారిన కాలువ
- వర్షాలు కురిస్తే రాకపోకలకు అంతరాయం



వంతెన నిర్మించాల్సిన ప్రదేశం



బీటీ రోడ్డు నిర్మాణానికి నోచుకోని ఉత్తునూర్ - భూంపల్లి రోడ్డు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): గ్రామీణ రోడ్లకు మహర్దశ కల్పిస్తున్నామని చెబుతున్న ప్రభుత్వాలు బీరాలు పలుకుతున్నాయే తప్ప ఆచరణలో మాత్రం అభివృద్ధి చూపడం లేదు. ఎన్నికల సమయంలో హామీలు గుప్పిస్తుండడం..ప్రజలు ఆ మాటలను నమ్మి ఓట్లు వేయడం పరిపాటిగా మారుతుంది. ప్రజాప్రతినిధుల వల్ల తమకు ఒరిగిందేమి లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కంకరతో ఉన్న రోడ్లను బీటీ రోడ్లుగా మార్చాలని కొన్ని సంవత్సరాలుగా అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు ఇస్తున్నా ఫలితం లేకుండా పోతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్ల నిర్మాణం చేపట్టకపోవడంతో ఆ రోడ్లు చినుకు పడితే చిత్తడిగా మారుతున్నాయి. సదాశివనగర్ మండలంలోని ఉత్తునూర్ నుంచి భూంపల్లికి, పద్మాజివాడి నుంచి తుక్కోజివాడికి, వజ్జపల్లి నుంచి ఉత్తునూర్‌కు వెళ్లే రోడ్లు బీటీకి నోచుకోలేదు. ఆయా గ్రామాలకు వెళ్లే మెటల్ రోడ్లను బీటీగా మార్చక పోవడంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుంది. ఉత్తునూర్ నుంచి భూంపల్లికి వెళ్లే లింక్ రోడ్డు మధ్యలో భారీ నీటి కాలువ ఉంది. ఈ ప్రాంతంలో వంతెన నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఉంది. వంతెన లేకపోవడంతో వర్షాలు కురినప్పుడు వరద ఉధృతంగా ప్రవహిస్తుందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. రోడ్డుపై కనీసం ద్విచక్ర వాహనాలు వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతుందని వారు చెబుతున్నారు. అలాగే వజ్జపల్లి నుంచి ఉత్తునూర్ వరకు గల కంకర రోడ్డుపై ప్రయాణించడం నరకంగా మారింది. ఒక పక్క ద్విచక్ర వాహనం వెళ్తే ఇంకో పక్క వెళ్తున్న వాహనాలకు రాళ్లు ఎగిరి తగులుతుండడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్డు పూర్తిగా కంకర తేలడంతో కాలినడకన వెళ్లలేకుండా తయారైంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించి కంకర రోడ్లను బీటీ రోడ్లుగా మార్చాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వంతెన కట్టాలి..



ఉత్తునూర్ నుంచి భూంపల్లికి పోయేందుకు ఇబ్బంది అవుతోంది. ఈ రోడ్డు మధ్యలో ఉన్న కాలువ వద్ద ఒక వంతెన కట్టిన తర్వాతనే బీటీ రోడ్డు వేయాలి. వంతెన కట్టకుంటే చాలా ఇబ్బందులు పడాల్సి వస్తది.

– దానె లక్ష్మీపతి, ఉత్తునూర్

బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టాలి..



ఉత్తునూర్ నుంచి భూంపల్లికి తర్వాత ఉత్తునూర్ నుంచి వజ్జపల్లికి వెళ్లే రోడ్లు కంకరతో ఏర్పాటు చేశారు. ఆ కంకర రోడ్లను బీటీ రోడ్లుగా మార్చాలి. బీటీ రోడ్లుగా మార్చకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు పట్టించుకోవాలే.

– గుడిసె అరవింద్, ఉత్తునూర్

ఎన్నికలప్పుడే ప్రజలు గుర్తొస్తరు..



కేవలం ఎన్నికలప్పుడే ఓట్ల కోసం ప్రజలు గుర్తొస్తరే తప్ప ప్రజా సమస్యలను పట్టించుకునే నాథుడు లేడు. రోడ్లపై ప్రతి రోజు వెళ్తుంటే నరకం కనిపిస్తుంది. ఆ రోడ్ల గుండా అధికారులు గానీ, ప్రజాప్రతినిధులు ప్రయాణిస్తే సమస్య ఏంటో తెలుస్తది వాళ్లకు.

– దివాకర్ రావు, ఉత్తునూర్

తప్పుడు ప్రచారం చేయడం సరికాదు



మద్నూర్‌లో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

మద్నూర్(జుక్కల్): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నేషనల్ హైవే మంజూరు చేస్తే అది మేమే చేసినట్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు తప్పుడు ప్రచారం చేయడం సరికాదని బీజేపీ మండల అధ్యక్షుడు తుకారం హితవు పలికారు. మండల కేంద్రంలో పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. జాతీయ రహదారి–161 బీబీ రోడ్డు మంజూరు గత సంవత్సరమే బీజేపీ ప్రభుత్వం మంజూరు చేసిందని.. కాని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు మాత్రం సోషల్ మీడియా ద్వారా అబద్ధపు ప్రచారం చేస్తున్నారని, దీన్ని బీజేపీ తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ పటేల్, ఓబీసీ అసెంబ్లీ కన్వీనర్ తుల సంతోష్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు యాదవ్‌రావ్, తదితరులున్నారు.

ప్రభుత్వ కళాశాలలో యోగా క్లాసులు ప్రారంభం

తాడ్వాయి(ఎల్లారెడ్డి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం యోగా, ధ్యాన శిక్షణ మండలి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్స్‌పల్ సయ్యద్ యూసుఫ్ హుస్సేన్ మాట్లాడుతూ.. విద్యార్థులు మానసికంగా ధృడంగా ఉండేందుకు ప్రతి శుక్రవారం ఒక గంటపాటు యోగా, ధ్యానం నేర్పిస్తున్నట్లు తెలిపారు. అధ్యాపకులు సంతోష్, సిబ్బంది పాల్గొన్నారు.

8న తెరసం పదేండ్ల సాహిత్య సభలు



కామారెడ్డి అర్బన్: తెలంగాణ రచయితల సంఘం (తెరసం) పదేండ్ల సాహిత్య సభలు ఈ నెల 8న హైదరాబాద్ రవీంద్రభారతిలో ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించనున్నట్టు తెరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.శంకర్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం కామారెడ్డిలో తెరసం పదేండ్ల సాహిత్య సభల ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సభలను విజయవంతం చేయాలని కోరారు. తెరసం ప్రతినిధులు ఎం.అశోక్‌కుమార్, సీహెచ్ ప్రకాష్, సిరిగాద శంకర్, వై.సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి మృతికి సంతాపం



కామారెడ్డి అర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రాయచోటి పట్టణం కొత్తపల్లి ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఎజాజ్ అహ్మద్‌ను ఛాతీపై కొట్టి విద్యార్థులు చంపిన ఘటన తమను కలిచివేసిందని, ఉపాధ్యాయులుగా తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ సంతాపం తెలుపుతున్నామని ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య జిల్లా నాయకులు అన్నారు. శుక్రవారం ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య నాయకులు మాట్లాడారు. ఉపాధ్యాయుడి మరణానికి కారకులైన విద్యార్థులపై కేసులు నమోదు చేసి కఠిన శిక్షించాలని డిమాండ్ చేశారు. నాయకులు యాదన్న, కుంటరాములు, బషీర్, పి.ప్రవీణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సంఘ సభ్యులు ఆర్థిక వ్యవస్థాపకులుగా ఎదగాలి



రాజంపేట: మహిళా సంఘ సభ్యులు ఆర్థిక వ్యవస్థాపకులుగా ఎదగాలని డీపీఎం రమేశ్ బాబు అన్నారు. శుక్రవారం రాజంపేట మండలంలోని స్థానిక గ్రామ సంఘ సభ్యులతో జెండర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాలు జరగకుండా అరికట్టాలని సూచించారు. ప్రజాపాలన వారోత్సవాల్లో భాగంగా ప్రతి మహిళ పారిశ్రామికవేత్తగా ఎదగాలని ఆకాంక్షించారు. ఏపీఎం సాయిలు, లక్ష్మి, శ్రీనివాస్, సంఘ సభ్యులున్నారు.

కాంగ్రెస్‌లో యువతకు ప్రాధాన్యత

- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ



షబ్బీర్ అలీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న వెంకటేశ్

భిక్కనూరు: కాంగ్రెస్ పార్టీలో యువతకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. శుక్రవారం మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీరామ్ వెంకటేష్, షబ్బీర్ అలీని కలసి కృతజ్ఞతలు తెలిపి అనంతరం సత్కరించారు. ఈ సందర్భంగా షబ్బీర్‌అలీ మాట్లాడుతూ.. రాహుల్ గాంధీని ప్రధాని చేసే బాధ్యత యువతదేనని అన్నారు. బీజేపీ కుట్రలు కుతంత్రాలతో దేశంలో పాలన కొనసాగిస్తుందని, యువత దీన్ని గుర్తించి ప్రజలను చైతన్య వంతులను చేయాలన్నారు. మాజీ ఎంపీపీ గాలిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ నంద రమేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు దయాకర్‌రెడ్డి, నేతలు నర్సింహారెడ్డి, సాజిద్, మద్దురి రవి పాల్గొన్నారు.

సమాచారం..

ఎల్లారెడ్డి, బిచ్కుందలలో నేడు ఆటోలు బంద్

ఎల్లారెడ్డిరూరల్/బిచ్కుంద(జుక్కల్): ప్రభుత్వం ఆటో, ట్యాక్సీ వాహనాల డ్రైవర్ల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించడం లేదని శనివారం ఆటోలు బంద్ పాటించి నిరసన తెలుపుతున్నామని సీఐటీయూ నాయకుడు సురేష్ గొండ అన్నారు. నియోజకవర్గంలోని అన్ని ఆటో యూనియన్లు బంద్‌లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఎల్లారెడ్డిలో కూడా బంద్ పాటిస్తున్న స్థానిక ఆటో యూనియన్ నాయకులు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

బీబీపేట: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో తాత్కాలిక పద్ధతిన ఇద్దరు మహిళలు(వంట నిర్వాహకులు, ఒకరు మహిళా అటెండర్) పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రత్యేకాధికారి వెంకటలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వంట సిబ్బందికి పదవ తరగతి, అటెండర్‌కు ఇంటర్మీడియట్ అర్హత కలిగి ఉండాలని, ఈ నెల 8 వరకు దరఖాస్తులను పాఠశాలలో స్వీకరిస్తామని ఆమె తెలిపారు.

అంబేడ్కర్ అడుగు జాడల్లో నడవాలి



బిచ్కుందలో నివాళులర్పిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షులు అరుణతార



ఎల్లారెడ్డిలో..బీజేపీ నాయకులు



ఎల్లారెడ్డి మున్సిపల్‌లో.. మున్సిపల్ చైర్మన్ శ్రీకాంత్



కుప్రియాల్‌లో..



గాంధారిలో..



దోమకొండలో..



కామారెడ్డి జిల్లా కేంద్రంలో..



కామారెడ్డి అర్బన్ ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో..



మహమ్మద్ నగర్‌లో..



బీబీపేటలో..

సాక్షి నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల శుక్రవారం అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ..భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ జీవితం అందరికీ ఆదర్శమన్నారు. ఆయన అడుగు జాడల్లో యువత నడుచుకోవాలని పిలుపునిచ్చారు. అంబేడ్కర్ ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ దేశానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.



సాత్‌క్యాంపస్‌లో..



కొండాపూర్‌లో..



కామారెడ్డి జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో..



పెద్దకొడప్‌గల్‌లో..



పిట్లంలో..



తాడ్వాయిలో..

మత్తు పదార్థాలకు బానిస కావొద్దు



2కే రన్‌లో పాల్గొన్న వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ నేతలు

కామారెడ్డి అర్బన్: మత్తు పదార్థాలకు యువత బానిస కావొద్దని, మత్తు సేవించడం ద్వారా వ్యక్తిగతంగానే కాకుండా కుటుంబాలు చిన్నాభిన్నం అవుతాయని, సమాజంలో విలువలు లేకుండా పోతారని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు నిత్యానందం అన్నారు. శుక్రవారం ఉదయం వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో స్థానిక నిజాంసాగర్ చౌరస్తా నుంచి పట్టణంలోని ప్రధాన వీధుల మీదుగా గంజ్ రామాలయం వరకు 2కే రన్ నిర్వహించారు. మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన, చైతన్యం కోసం 2కే రన్ నిర్వహించినట్లు నిత్యానందం పేర్కొన్నారు. వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి బొల్లిరాజు, ఉపాధ్యక్షుడు సామల గంగారెడ్డి, ప్రచార ప్రముఖ్ శ్రీకాంత్‌రావు, బజరంగ్‌దళ్ జిల్లా సంయోజక్ వివేకానంద అశోక్, వీహెచ్‌పీ పట్టణ అధ్యక్షుడు వి.వెంకటస్వామి, ప్రతినిధులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ ద్వారా మురికి నీటి సరఫరా



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి పట్టణంలో మిషన్ భగీరథ ద్వారా మురికి నీరు సరఫరా అవుతోందని పట్టణవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం పట్టణంలోని కల్యాణి బేస్ కాలనీలో ఉదయం మిషన్ భగీరథ పైపుల ద్వారా సరఫరా అయిన నీరు పూర్తిగా నల్లరంగులో ఉండడంతో పాటు చిన్న చిన్న పురుగులు రావడంతో నీరు వాడేందుకు ఇబ్బందిగా ఉందని కాలనీవాసులు వాపోయారు. నీరు కలుషితం కాకుండా అధికారులు త్వరగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

విద్యార్థుల సామర్థ్యాల పెంపు కోసమే ప్రతిభా పరీక్షలు



కామారెడ్డి రూరల్: శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని తెలంగాణ గణిత ఫోరం ఆధ్వర్యంలో ఈ నెల 11న కామారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి గణిత ప్రతిభా పరీక్ష నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు తాడ్వాయి శ్రీనివాస్ తెలిపారు.10వ తరగతి విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీయడానికి ఈ ప్రతిభా పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేణుగోపాల్, రామారావు, నరేందర్ పాల్గొన్నారు.

సంక్షిప్తం

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

ఎల్లారెడ్డిరూరల్: అన్నాసాగర్ గ్రామానికి చెందిన రైతులు శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. సన్నరకం ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేస్తు వారు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో రామాగౌడ్, రాజు, సాయిలు తదితరులున్నారు.

ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా నారాయణ



సదాశివనగర్(ఎల్లారెడ్డి): సదాశివనగర్ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా పి.నారాయణ బాధ్యతలు స్వీకరించారు. రామారెడ్డి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపడుతున్న పి.నారాయణను ఉన్నతాధికారులు సదాశివనగర్ కళాశాలకు ఇంచార్జీ ప్రిన్సిపాల్‌గా కొనసాగాలని ఉత్తర్వులు ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. నూతన ప్రిన్సిపాల్‌ను కళాశాల అధ్యాపక సిబ్బంది సన్మానించారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



లింగంపేట(ఎల్లారెడ్డి): బాణాపూర్, ఒంటర్‌పల్లి, కొయ్యగుండు తండా, నల్లమడుగు గ్రామాలలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్ కల్యాణలక్ష్మి, షాది ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఆయా గ్రామాలకు చెందిన 23 మందికి ఇంటింటికి వెళ్లి పంపిణీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఎల్లమయ్య, సాయికుమార్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాలు..



మద్నూర్(జుక్కల్): అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం మేనూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మండల మాల సంఘం అధ్యక్షుడు ఆకాష్ నోట్ పుస్తకాలు, పెన్నులను పంపిణీ చేశారు. అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. ఉపాధ్యాయులు శంకర్, సందీప్, ప్రకాష్, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై తనిఖీలు



మద్నూర్(జుక్కల్): సలాబత్‌పూర్ వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఎస్సై విజయ్ కొండ ఆధ్వర్యంలో క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. డ్రైవింగ్ లైసెన్స్‌లు ఉన్న వారే వాహనాలు నడపాలని లేకుంటే జరిమానాలు తప్పవన్నారు.

ఎల్లారెడ్డిలో..

ఎల్లారెడ్డి: పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఎస్సై మహేష్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. పెండింగ్ చలాన్లు కట్టాలని వాహనదారులకు సూచించారు.